రేవంత్.. నీ కుర్చీ కాపాడుకో!

మొదటిపేజీ తరువాయి...

వ్యాపారానికే వ్యతిరేకమని స్పష్టంచేశారు. 'హైదరాబాద్ నుంచి వాడపల్లి వరకు పాదయాత్ర చేద్దాం.. రేపు రమ్మంటావా? ఎల్లుండి రమ్మంటావా?' అని ప్రశ్నించారు. తాను, కేటీఆర్ ఎలాంటి సెక్యూరిటీ లేకుండా వస్తామని సవాల్ విసిరారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు 11 నెలల కాలంలోనే అన్నివర్గాల ప్రజల నుంచి తిరుగుబాటును ఎదుర్కొంటున్నదని, ఇప్పుడు ఎన్నికలు పెట్టినా బీఆర్ఎస్‌కు 100 సీట్లు గ్యారెంటీ అని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావడం పక్కా అని చెప్పారు. రుణమాఫీ, రైతుబంధు, ధాన్యం, పత్తి కొనుగోళ్లపై రైతులు, 29 జీవోపై నిరుద్యోగులు, ఏక్ పోలీస్ విధానంపై పోలీసులు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు ఇలా అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. రేవంత్ నోరు తెరిస్తే అన్నీ పచ్చి అబద్ధాలని, ఆయన మాట్లాడుతుంటే పిల్లలు ఎక్కడ చెడిపోతారోనన్న భయంతో తల్లిదండ్రులు టీవీలు బంద్ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. సొంత తండ్రి పిల్లలను నమ్మనట్టుగా తనకు రక్షణ కల్పిస్తున్న స్పెషల్ పోలీసులను రేవంత్‌రెడ్డి నమ్మడం లేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏక్ పోలీస్ విధానం అమలు అడిగేతే 39 మందిని సస్పెండ్ చేయడం, 10 మంది డిస్మిస్ చేయడం ఏమిటని నిలదీశారు.

మాట మీద ఉండని రేవంత్..

సీఎం రేవంత్‌రెడ్డివి అన్నీ అబద్ధాలేనని, మాట మీద నిలబడని వ్యక్తి అని హరీశ్ విమర్శించారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని బహిరంగంగా చెప్పిన రేవంత్ మళ్లీ వచ్చి మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేశారని గుర్తుచేశారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు రైతులందరికీ రుణమాఫీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చి తప్పాడని చెప్పారు. 31 రకాల సాకులతో రుణమాఫీని ఎగ్గొట్టారని, దాన్ని పూర్తి రుణమాఫీ కాదు.. పాక్షిక రుణమాఫీ అంటారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో రైతులను రేవంత్ మోసం చేశారని మండిపడ్డారు. మాట మీద నిలబడని ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్రలో నిలుస్తారని చెప్పారు. ఏడాది పూర్తి కావస్తున్నా, పూర్తి క్యాబినెట్ వేయలేక పోయారని, రాష్ట్రాన్ని సమస్యల కుప్పగా మార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆరు మంత్రి పదవులు కూడా నింపుకోలేదని, విద్య, హోం శాఖలకు మంత్రులే లేరని మంత్రివర్గ విస్తరణ చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ చేయాల్సిన పనులు పక్కన పెట్టి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

గోల్ కొట్టేది మేమే.. కప్ గెలిచేది మేమే..

'నీకు ఫుట్‌బాల్ ఒక్కటే వచ్చు.. నాకు క్రికెట్ మాత్రమే తెలుసు. క్రికెట్‌లో ఒక్కరిద్దరు గెలువలేరు. అందరూ బాగా ఆడితేనే గెలుస్తారు. బీఆర్ఎస్ క్యాడర్ అంతా యాక్టివ్‌గా ఉన్నది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. గోల్ కొట్టేది మేమే.. వికెట్ తీసేది మేమే..కప్ గెలిచేదీ మేమే? ఈ లోపు హిట్‌వికెట్ కాకుండా చూసుకో.. సెల్ఫ్ గోల్ చేసుకోకు రేవంత్.. నీ మంత్రులే నిన్ను ఔట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నరు' అని హరీశ్ ఎద్దేశాచేశారు.

రేవంత్‌రెడ్డి ఓ లాఫింగ్ స్టాక్

రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీకున్న గౌరవాన్ని తగ్గిస్తున్నారని, లాఫింగ్ స్టాక్ (జోకర్) అయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. 'హైదరాబాద్‌కు మూడు దిక్కులా సముద్రం ఉందంటరు. మరి గోవాకు ఎందుకు వెళ్లడం అని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నయి. కంప్యూటర్‌ను రాజీవ్‌గాంధీ కనిపెట్టిండంటరు.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతరంటరు.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూమి 17,871 ఎకరాలైతే 50వేల ఎకరాలు ముంపునకు గురైందని పుణ్యాత్ముడు సీఎం చెప్తరు. ఏడు గ్రామాలు ముంపులో పోతే 14 గ్రామాలంటరు. బీఆర్ఎస్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదంటరు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఒక్క ఇల్లు కూడా కట్టలేదంటరు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడ్తరు. రేవంత్‌రెడ్డి మాటలపై ప్రజలకు నమ్మకం పోతున్నది. సీఎం మాటలు విన్న పిల్లలు అవి నిజమనుకొని వాటినే పరీక్షల్లో రాస్తే పరిస్థితి ఏంది? పిల్లలు ఎక్కడ చెడిపోతారోనన్న భయంతో తల్లిదండ్రులు టీవీలు బంద్ పెడ్తున్నాన్నరు' అని హరీశ్ ఎద్దేవా చేశారు.

రాహుల్ ఎక్స్‌పైరీ మెడిసినా?

కొండంత కేసీఆర్‌ను ఫినిష్ చేస్తామనే చిల్లర మాటలు మానుకోవాలని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు హితవుపలికారు.'కేంద్రంలో కాంగ్రెస్ మూడు సార్లు ఓడిపోయింది.. రేవంత్‌రెడ్డి ప్రకారం రాహుల్ గాంధీ ఎక్స్‌పైరీ మెడిసిన్ అంటున్నారా?' అని ప్రశ్నించారు. చిల్లర పనులు బంద్ చేసి హామీల అమలుపై దృష్టి పెట్టాలి. రేవంత్ లాంటి చాలా మంది చిల్లర మాటలు మాట్లాడి అభాసుపాలైంద్రు. ముందు పక్కనున్న వాళ్లు రేవంత్‌రెడ్డిని ఫినిష్ చేయకుండా చూసుకోవాలి. ఐదేండ్లు రేవంత్ రెడ్డి ఉండాలని కోరుకుంటున్నం' అని పేర్కొన్నారు.

కూల్చడమే రేవంత్ పాలసీ

రేవంత్‌రెడ్డి పాలసీ కట్టడం కాదని, కూల్చమేనని హరీశ్ విమర్శించారు. మెట్రో రద్దు, ఫార్మాసిటీ రద్దు చేస్తాం అని ఇష్టమొచ్చినట్టు రేవంత్‌రెడ్డి మాట్లాడం వల్లే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఢమాల్ అయింద న్నారు. దేశవ్యాప్తంగా రియల్ వ్యాపారం తగ్గిందని బుకాయిస్తున్న రేవంత్‌రెడ్డి.. ఢిల్లీ, ముంబై, బెంగళూరులో ఎందుకు పెరుగుతున్నదో చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో భవనాల అనుమతుల దరఖాస్తులు పది నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని విమర్శించారు.

నీ మంత్రులే ఫినిష్ చేస్తరు కావచ్చు!

కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? రాష్ట్రం రాకుంటే తెలంగాణకు రేవంత్ ముఖ్యమంత్రి అవుతుండెనా? అని హరీశ్‌రావు నిలదీశారు. 'రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష. కేసీఆర్ తెలంగాణ రక్షకుడు. మళ్లీ సీఎం కేసీఆరేనని ప్రజలు డిసైడ్ అయ్యింద్రు. కుర్చీని ఎప్పుడు ఎవరు గుంజుకుపోతారోనన్న భయంతో రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఈ మధ్యకాలంలో ఒక మంత్రి గవర్నర్‌ను కలిశారు. ఇంకో మంత్రి హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగారు. మరోమంత్రి ఏమో ఢిల్లీ వెళ్లారు. కొంతమంది మేము సీఎం అవుతామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నరు. నీ మంత్రులు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో. సీనియర్లు కుర్చీని గుంజుకోకుండా చూసుకో' అని రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు.

కేసీఆర్ విజన్ ఎప్పుడో చెప్పారు

మూసీపై అభ్యంతరాలు, విజన్ ఉంటే చెప్పండని సీఎం అంటున్నారని, మూసీ విషయంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కేసీఆర్ తన విజన్‌ను అసెంబ్లీ సాక్షిగా ఆవిష్కరించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. 'రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో చాలా ఇండ్లు కూల్చారు.. కానీ, ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. మూసీ పునరుద్ధరణ చేపట్టిందే బీఆర్ఎస్. వ్యతిరేకం ఎలా అవుతాం? బఫర్‌లో ఉన్న పేదల ఇండ్లు కూలగొట్టవద్దని చెప్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారు' అని హరీశ్ విమర్శించారు.

మల్లయ్య ఇల్లు కూల్చి మాల్ కడతారా?

మూసీ పునరుజ్జీవంపై బీఆర్ఎస్ విజన్ క్లియర్‌గా ఉన్నదని హరీశ్‌రావు చెప్పారు. మూసీ ప్రాజెక్టు అభివృద్ధికి అనుకూలమని, సుందరీకరణ పేరిట కమీషన్ల కోసం పేదల ఇండ్లు కులగొడతామంటే అందుకు తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వ్యతిరేకమని చెప్పారు. మల్లయ్య ఇల్లు కూల్చివేసి మాల్ కడుతామంటే ఒప్పుకోబోమని హెచ్చరించారు.

కమీషన్ల కోసమే 7వేల కోట్లకు పెంచారా?

కొండపోచమ్మసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, గండిపేటకు గోదావరి నీళ్లు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌తో కేసీఆర్ డీపీఆర్ చేయించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న కొండపోచమ్మసాగర్ కాకుండా దూరంగా మల్లన్నసాగర్ నుంచి ఎందుకు మారుస్తున్నారని నిలదీశారు. రూ.1100 కోట్లతో అయ్యే పనిని రూ.7,000 కోట్లకు కమీషన్ల కోసమే పెంచారా? అని మండిపడ్డారు.

మాకంటే డబుల్ పరిహారం ఇవ్వు

మల్లన్నసాగర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం తాము ఇచ్చిన నష్టపరిహారం కంటే రెట్టింపును మూసీ బాధితులకు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఆసియాలోనే అద్భుతమైన ఆర్అండ్ ఆర్ కాలనీ నిర్మించామని చెప్పారు. తాము 250 గజాల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చామని, 18 ఏండ్లు నిండినవారికి రూ.5 లక్షలు ఇచ్చామని, ఇండ్లు కట్టించామని, బ్రహ్మాండంగా వసతులు కల్పించామని తెలిపారు. మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ రాజమౌళి సినిమాను తలపించేలా ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో మూసీ నిర్వాసితులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూం ఇండ్లలోకి రూ.25 వేలు ఇచ్చి పంపిస్తామంటే ఎలా? అని ప్రశ్నించారు. గచ్చిబౌలిలోని భూమిని అమ్ముకొని రూ.10 వేల కోట్లు కొల్లగొట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి చేస్తున్నారని ఆరోపించారు.

అక్రమ కేసులు పెట్టిస్తున్నవ్

రుణమాఫీ, రైతుభరోసా, బోనస్, తులం బంగారం ఎగ్గొట్టినందుకు.. ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు బేగంబజార్ ఠాణాలో తనపై కేసు పెట్టించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. బుల్డోజర్లతో తనను, కేటీఆర్‌ను తొక్కించి చంపుతానని రేవంత్‌రెడ్డి బెదిరిస్తే తాము బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సొంత అభిప్రాయాలు చెప్పినా కేసులు పెట్టించడం ప్రజాపాలనా? అని నిలదీశారు.

టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి పాదయాత్రకు సిద్ధమా?

హైదరాబాద్‌లోని మూసీ టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి వాడపల్లి వరకు రేవంత్‌తో పాదయాత్రకు తాము సిద్ధమని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'రేపా? ఎల్లుండా? టైం చెప్తే కేటీఆర్, నేను.. ఇద్దరం వస్తం. గన్‌మెన్లు లేకుండా రేవంత్‌రెడ్డి మూసీపై పాదయాత్రకు రావాలి' అని సవాల్ చేశారు.

భారీ బాపూ విగ్రహం పెట్టండి

హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో భారీ గాంధీ విగ్రహం పెడితే స్వాగతిస్తామని హరీశ్ చెప్పారు. 'కేసీఆర్ పెట్టిన భారీ అంబేద్కర్ విగ్రహానికి రేవంత్ దండం పెట్టడు.. ప్రజలు దర్శించుకొనే చాన్స్ ఇవ్వని రేవంత్.. బాపూ విగ్రహం పెడతానంటున్నరు' అని దుయ్యబట్టారు.

పండుగపూట 163 సెక్షన్ తుగ్లక్ చర్య

రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా ధర్నాలు జరుగుతున్నాయని, మద్దతు ధర ఇవ్వాలని రైతులు కలెక్టర్ కాళ్ల మీద పడుతున్నారని హరీశ్‌రావు చెప్పారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారుల కాళ్లమీద పోలీసులు పడుతున్నారని గుర్తుచేశారు. నిరుద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు ఆందోళన బాటపట్టారని తెలిపారు. వీరి తిరుగుబాటు నుంచి తప్పించుకోవడానికి పండుగపూట 163 సెక్షన్ పెట్టడం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

35 వేల కోట్ల భారం మనకెందుకు?

కేంద్రం చేసే అవకాశం ఉన్నా దురాశతో 35 వేల కోట్లను రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) కోసం రాష్ట్రంపై ఎందుకు భారం వేస్తున్నారని హరీశ్‌రావు నిలదీశారు. రీజినల్ రింగ్ రోడ్డును కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్నదని, డీపీఆర్ కూడా సిద్ధమైందని హరీశ్ గుర్తుచేశారు. ట్రిపుల్‌ఆర్‌కు రూ.35 వేల కోట్లు కూడా మూసీ సుందరీకరణలోని లక్షన్నర కోట్ల నుంచే పెడతామని సీఎం చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

అప్పులపై మళ్లీ అబద్ధాలు

అసెంబ్లీ సాక్షిగా, పూర్తి ఆధారాలతో రాష్ట్ర అప్పుల గురించి తాను చెప్పినా సీఎం రేవంత్‌రెడ్డి అవే అబద్ధాలు చెప్తూ గోబెల్స్‌ను తలపిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమాల కోసం చేసిన అప్పు రూ.4 లక్షల 26 వేల 499 కోట్లేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల కాలంలోనే రూ.85 వేల కోట్ల దాకా అప్పు తెచ్చిందని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న బడ్జెటేతర రుణాల వివరాలను తమకు చెప్పలేదని కాగ్ తన సెప్టెంబర్ నివేదికలో వెల్లడించినట్టు పేర్కొన్నారు. 'అది రూ.85 వేల కోట్లా?, లక్ష కోట్లా? అనేది కాగ్‌కు ప్రభుత్వం చెప్పాల్సి ఉన్నా ఎందుకు చెప్పడం లేదు? ఎందుకు దాస్తున్నరు? తీసుకున్న రుణాలను ఏం చేస్తున్నరు?' అని హరీశ్ ప్రశ్నల వర్షం కురిపించారు.

నన్ను డీల్ చేయడం కాదు..

తనను డీల్ చేస్తామన్న రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. 'నన్ను డీల్ చేయటం కాదు.. మెదట రేవంత్ తన కుర్చీని కాపాడుకోవాలి' అని చురకలంటించారు. నాలుగేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చాక రేవంత్‌ను ఎలా డీల్ చేయాలో రాసి పెట్టుకుంటున్నామని పేర్కొన్నారు.



సంక్షేమ ప్రదాతతో.. శాడిస్టుకు పోలికా?

'14 ఏండ్లపాటు పోరాడి చుక్కనెత్తురు చిందకుండా తెలంగాణను సాధించి, అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డికి పోలికా?' అని హరీశ్‌రావు దెప్పిపొడిచారు. 'తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్.. కేసీఆర్ లీడర్.. కేసీఆర్ ఫైటర్.. కేసీఆర్ సాక్రిఫైజర్ (త్యాగశీలి).. కేసీఆర్ విజనర్.. తెలంగాణ సేవియర్.. కేసీఆర్ అచీవర్, ఎక్స్ట్రార్డినరీ పవర్ ఫుల్‌పర్సన్' అని కొనియాడారు. సంక్షేమ ప్రదాతకు, శాడిస్టు రేవంత్‌కు పోలికా? అని నిలదీశారు. 'నిర్మాణాల పాలనకు.. కూల్చివేతల పాలనకు పొంతన ఉన్నదా.. నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉన్నది' అని ఎద్దేవాచేశారు.

ప్రశ్నిస్తున్నడనే కేటీఆర్‌పై పగ

పరిపాలన చేతగాని రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి కుట్రపూరితంగా కేసులు పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ బెదిరింపులకు ఎవరూ భయపడరని తేల్చిచెప్పారు. ప్రశ్నించే గొంతుక అయిన కేటీఆర్‌పై పగబడుతూ, అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. 'ఫార్ములా రేసింగ్‌పై ఏసీబీ విచారణ చేయండి.. ఏం కేసులు పెడతారో చూస్తాం' అని హెచ్చరించారు. దేనికీ భయపడబోమని, చట్ట ప్రకారం పోరాడుతామని చెప్పారు.

ఏక్‌పోలీస్ హామీ ఇవ్వలేదా?

తాము అధికారంలోకి వస్తే ఏక్ పోలీస్ విధానం అమలు చేస్తామని ఎన్నికల్లో రేవంత్ చెప్పలేదా? అని హరీశ్‌రావు నిలదీశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే 39 మంది టీజీఎస్పీ పోలీసులను సస్పెండ్, 10 మందిని డిస్మిస్ చేయడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. రేవంత్ ఇంటి వద్ద, సచివాలయం వద్ద స్పెషల్ పోలీసులను భద్రతా విధుల నుంచి తప్పించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. 'రాగద్వేషాలకు అతీతంగా పనిచేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి.. తనకు రక్షణ కల్పించే పోలీసులను కూడా నమ్మడం లేదు. కానిస్టేబుళ్ల సమస్యలు తెలుసుకునే సమయం సీఎంకు లేదా? ఇలా పంపిస్తే సమస్య తీరుతుందా? వారి ఆత్మాభిమానం దెబ్బతినదా? ఇది ఎంత దుర్మార్గం? క్యాబినెట్ సబ్‌కమిటీ వేసి పోలీసుల సమస్యలపై చర్చించాలి' అని డిమాండ్ చేశారు. ముందుగా సస్పెండ్, డిస్మిస్ చేసిన పోలీసులను విధుల్లో తీసుకోవాలన్నారు.

మరో రైతు ఆత్మహత్య

వెంకటేశ్వర్లు (ఫైల్)

తొర్రూరు, అక్టోబర్ 30: సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పోలేపల్లికి చెందిన పందుల వెంకటేశ్వర్లు(55)తన 3 ఎకరాల భూమిలో వరి, పత్తి సాగు చేశాడు. ఈ ఏడాది దిగుబడి ఆశించినంత రాలేదు. మరోవైపు 4 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. ఇంకోవైపు గొర్రెలకు వ్యాధి సోకి చనిపోవడంతో రూ. 9.60 లక్షలు అప్పు అయ్యింది. వీటిని తీర్చలేక మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

10న గ్రూప్-3 హాల్ టికెట్లు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): గ్రూప్-3 పరీక్షల హాల్‌టికెట్లను నవంబర్ 10న విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. అదే రోజు నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, ప్రశ్నపత్రాలను భద్రపరుచుకోవాలని కమిషన్ సూచించింది. డూప్లికేట్ హాల్‌టికెట్లు జారీ చేయబోమని తెలిపింది. గ్రూప్-3 పరీక్షలను నవంబర్ 17, 18న నిర్వహించనున్నారు. 5.36లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

సీనియర్ ఐఏఎస్‌లకు చంద్రబాబు గాలం!

- ప్రభుత్వ సలహాదారులుగా చేర్చుకుంటామని ఆఫర్
- రాజకీయ అనిశ్చితి వల్ల ఏపీకి వెళ్లేందుకు అధికారుల మొగ్గు
- పదవులు ఇక్కడే ఇస్తామంటూ ఆపుతున్న రాష్ట్ర సర్కారు
- సచివాలయంలో జోరుగా చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాజకీయ అనిశ్చితి, రోజుకొక వివాదంతో ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పావులు కదుపుతున్నది. ఇందులో భాగంగా ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఏపీ ప్రభుత్వ సలహాదారులుగా నియమించుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఒక అధికారితోపాటు సీఎస్ రేసులో ఉన్న మరో అధికారికి స్వయంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్‌చేసి, ఈ మేరకు ఆఫర్ ఇచ్చినట్టు సచివాలయంలో చర్చ జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అంతర్జాతీయ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నట్టు, అనేక భారీ ప్రాజెక్టులు, పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నందున అనుభవజ్ఞులైన మీరు ఎట్టి పరిస్థితుల్లో ఏపీకి రావాలని సదరు అధికారులను చంద్రబాబు గట్టిగా కోరినట్టు సమాచారం. రాష్ట్ర ఆర్థిక శాఖలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి పదవీ విరమణకు చేరువలో ఉండగా, పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న మరో సీనియర్ ఐఏఎస్ అధికారి తదుపరి చీఫ్ సెక్రటరీ రేసులో ఉన్నారు. ఎటువంటి ఆర్థిక ఇబ్బందులున్నా చాకచక్యంతో నెట్టుకురాగల సామర్థ్యం ఒకరికి ఉంటే, ఎంతటి బడా కంపెనీ అయినా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే విధంగా చేయగల నేర్పరితనం మరో అధికారి సొంతం. అందుకే కేసీఆర్ ప్రభుత్వంలో ఈ ఇద్దరు అధికారులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. కాంగ్రెస్ సర్కారు సైతం వారికి అదేవిధమైన ప్రాధాన్యం కొనసాగిస్తున్నది. ప్రస్తుతానికి రాష్ట్ర సర్కారు నుంచి వారికి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో వారు సర్దుకుపోలేకపోతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రికీ, మంత్రులకు మధ్య సమన్వయలోపం, విచారణలు, కేసుల పేరుతో అధికారులపై వేధింపులు, నిధుల సమస్య, బిల్లుల చెల్లింపు కోసం ఒత్తిళ్లు, పరిశ్రమలకు భూముల కేటాయింపులో మంత్రుల మితిమీరిన జోక్యం తదితర అంశాలతో వారు కొంతకాలంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్టు చర్చ జరుగుతున్నది.

స్వయంగా ఆఫర్ ఇచ్చిన చంద్రబాబు

ఈ నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు అక్కడి రాష్ట్ర రాజకీయాలతో సంబంధం లేకుండా ఉండే సీనియర్ అధికారుల కోసం వేట కొనసాగిస్తున్నట్టు, ఇందులోభాగంగా తనకు గతంలో మంచి పరిచయం ఉన్న ఈ ఇరువురు అధికారులను ఏపీకి రావాలని కోరినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఉద్యోగాలకు రాజీనామా చేసి వస్తే ప్రభుత్వ సలహాదారులుగా నియమిస్తామని, ఐదేండ్లపాటు ఎటువంటి ఢోకా ఉండదని, ఆ తరువాత కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన స్వయంగా ఫోన్‌చేసి వారికి భరోసా ఇచ్చినట్టు సమాచారం. కేంద్రం నుంచి ఏపీకి అనేక ప్రాజెక్టులు వస్తున్నాయని, పెట్టుబడులు కూడా భారీగా వస్తున్నందున అనుభవజ్ఞులైన అధికారుల అవసరం తమకు ఎంతో ఉన్నదని ఆయన చెప్పినట్టు తెలిసింది. తెలంగాణలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో ఏపీకి వెళ్లేందుకు సదరు అధికారులు మొగ్గు చూపారనే చర్చ జరుగుతున్నది. వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లగా, ఆయన వారిని రిలీవ్ చేయవద్దని సీఎస్‌కు స్పష్టంచేసినట్టు సమాచారం. అంతేకాదు, వారిద్దిరినీ పిలిచి ఇక్కడే మంచి భవిష్యత్తు ఉంటుందని, పదవీ విరమణ తరువాత ఇక్కడే సలహాదారుగా నియమించుకుంటామని ఒకరికి, తదుపరి సీఎస్‌గా నియమిస్తామని మరొకరికి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు వినికిడి.

సర్కారు మనుగడపై కుదరని నమ్మకం

తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వ మనుగడపై సదరు అధికారులకు నమ్మకం కుదరడంలేదని చర్చ జరుగుతున్నది. కేంద్రం నుంచి కూడా ఆశించినస్థాయిలో సహకారం లభించకపోవడం, కొందరు సీనియర్ మంత్రులు తరచూ పార్టీ హైకమాండ్‌కు ఇచ్చే ఫిర్యాదులు ప్రభుత్వ మనుగడపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో అని వారు ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ నిర్ణయాలతో రోజురోజుకూ ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, విచారణలు, కేసుల పేరుతో పలువురు అధికారులను వేధింపులకు గురిచేయడం, కొందరు అధికారులపై ప్రత్యేక నిఘా ఉంచడం తదితర అంశాలు వారిని కలవరపాటుకు గురిచేస్తున్నట్టు, ఇదే విషయాన్ని వారు తమ సన్నిహితుల వద్ద పంచుకుంటున్నట్టు చర్చ జరుగుతున్నది. ఏపీ సీఎం ఇచ్చిన హామీని తిరస్కరిస్తే, మంచి అవకాశాన్ని కోల్పోయినట్టు అవుతుందని వారు అభిప్రాయపడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఏపీ ప్రభుత్వం ఎన్డీఏ భాగస్వామిగా ఉన్నందున అక్కడికి వెళ్తే కేంద్రం నుంచి అవసరమైన సహకారం లభిస్తుందని, అనేక ప్రాజెక్టులు ఏపీకి వచ్చే అవకాశం ఉన్నందున తమసేవలకు మంచి గుర్తింపు ఉంటుందని వారు భావిస్తున్నట్టు చెప్తున్నారు. మొత్తానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీతో వారు ఏపీకి వెళ్లాలనుకున్న తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్టు అధికావర్గాలు పేర్కొంటున్నాయి.

ముగిసిన రాజ్‌పాకాల విచారణ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): జన్వాడ వద్ద ఇంట్లో జరిగిన దీపావళి వేడుకలకు సంబంధించిన కేసులో రాజ్‌పాకాల బుధవారం మోకిల పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.30 గంట ల సమయంలో మోకిల ఠాణాలోకి వెళ్లిన రాజ్‌పాకాలను నార్సింగి ఏసీపీ వెంకటరమణగౌడ్ ఆధ్వర్యంలో రాత్రి 7.30 గంటల వరకు దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించారు. మధ్య లో పోలీసులు రాజ్‌పాకాలను పార్టీ జరిగిన జన్వాడ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ గంటపాటు విచారణ జరిపిన పోలీసులు తీరిగి మోకిల స్టేషన్‌కు తీసుకువచ్చి రాత్రి 7.30 గంటల వరకు విచారించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుతం రాజ్‌పాకాల విచారణ పూర్తయిందని వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉన్నందున ప్రస్తు తం ఎలాంటి విషయాలు మీడియా కు వెల్లడించలేమని, అవసరమైతే మరోసారి రాజ్‌పాకాలను విచారణకు పిలుస్తామని చెప్పారు.

కావాలనే ఇష్యూను పెద్దదిగా చిత్రీకరిస్తున్నారు: రాజ్‌పాకాల

పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని రాజ్‌పాకాల తెలిపారు. వారికి పూర్తిగా సహకరించానని అన్నారు. తమ ఇంట్లో జరిగింది కేవలం ఫ్యామిలీ పార్టీనే అని చెప్పారు. విజయ్ మద్దూరి పోలీసులకు ఎలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. ఎవరికో పాజిటివ్ వస్తే తనకేంటి సంబంధం అని ప్రశ్నించారు. 'ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలిసి పార్టీ చేసుకోకూడదా...? రాజకీయ దురుద్దేశంతోనే కావాలని ఇష్యూను పెద్దగా చిత్రీకరిస్తున్నారు' అని మండిపడ్డారు.

ఇవ్వాల్సింది ఐదు.. ఇచ్చింది ఒక్కటే!

- ఒక్క డీఏతో సరిపెట్టిన సర్కార్
- పాత బకాయిలు 17 వాయిదాల్లో చెల్లింపు
- డీఏ 3.64% పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): 'ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లోని డీఏలను తక్షణం చెల్లిస్తాం. సప్లిమెంటరీ బిల్లులను 15 పనిదినాల్లో చెల్లిస్తాం' ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకిచ్చిన హామీ. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఒకేఒక్క డీఏను విడుదల చేసింది. పాత బకాయిలను ఏకమొత్తంలో కాకుండా, 17 సమాన వాయిదాల్లో చెల్లిస్తామని తెలిపింది. ఈ ఐదు డీఏలు విడుదలైతే ఉద్యోగులకు నెలకు కనిష్ఠంగా రూ.8వేల నుంచి గరిష్ఠంగా రూ. 20 వేల వరకు అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం 3.64% పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 2025 మార్చి 31లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగుల డీఏ బకాయిలను 17 సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్టు తెలిపింది. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిల్లో 10% ప్రాన్‌ఖాతాకు జమచేస్తారు. మిగతా 90 శాతాన్ని 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లిస్తారు. పెన్షనర్ల డీఏ బకాయిలను 2025 జనవరి నుంచి 17 వాయిదాల్లో చెల్లించనున్నట్టు తెలిపిం ది. డీఏ మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌ను జనవరిలో బిల్లు చేస్తే ఫిబ్రవరి 1న పొందుతారు.

26 శాతానికి చేరిన డీఏ

పెంచిన డీఏ 2022 జూలై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం జీవోలో తెలిపింది. ఇదివరకు డీఏ 22.75% ఉండగా, పెరిగిన దానితో కలిపి 26.39 శాతానికి చేరింది. 2022 జూలై 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు (28 నెలల) డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పుడిచ్చిన డీఏను మినహాయిస్తే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉండగా, ఈ డిసెంబర్‌లో మరో డీఏ బకాయిల జాబితాలో చేరుతుంది. దీంతో పెండింగ్ డీఏల సంఖ్య మళ్లీ ఐదుకు చేరుతుంది.

17 వాయిదాలు సరికాదు: కమలాకర్

సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను 17 వాయిదాల్లో చెల్లించడం సరికాదని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అభ్యంతరం వ్యక్తంచేశారు.

మయోనీస్‌పై ఏడాది నిషేధం

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న మయోనీస్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది.బుధవారం ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉడకబెట్టని కోడిగుడ్లతో మయోనీస్ తయారీ, నిల్వ, అమ్మకాన్ని ఏడాది పాటు నిషేధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుడ్ల పచ్చి సొన, నూనె, వెనిగర్, నిమ్మరసం వంటివి కలిపి మయోనీస్ తయారు చేస్తున్నారని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో గుర్తించిన అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

విరివిగా వినియోగం

స్ట్రీట్ ఫుడ్‌లో మయోనీస్ వినియోగం విపరీతంగా పెరిగింది. సాండ్‌విచ్, సలాడ్, షవర్మా, గ్రిల్డ్ మీట్, మోమోస్ వంటి ఆహార పదార్థాలను మయోనీస్‌తో కలిపి తింటుంటారు. మయోనీస్‌ను హోటళ్లు, ఫుడ్ కోర్ట్ నిర్వాహకులే తయారు చేసి ఫ్రిజ్‌లలో వారాల తరబడి నిల్వ చేస్తుండటంతో కలుషితం అవుతున్నది. దీంతో ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని ఫుడ్ పాయిజన్ అయిన ఘటనలో ఓ మహిళ మరణించింది.